‘‘తడ్సి ముద్దయినవ్గా పిల్లా! తానం సేద్దా పా!’’ అన్కుంటా.. తానాలు చేసే తడికెల సాటుకు వట్కవోయింరు.

అప్పటికే గోలెంల ఎవరో వేడినీల్లు తోడివెట్టింరు. బలవంతంగా తనను కూకోవెట్టి తానం చేయించింరు. తను బిత్తరవోయి..

‘‘ఏందిది వదినా?’’ అనడిగితే..

‘‘తొందరెందుకమ్మా మరదలా.. నీకే ఎర్కయితదిగా!’’ అనింది సిన్న వదిన.

తానం చేయించినంక గుడిసెలకు తీస్కవొయి కొత్త బట్టలు కట్టిచ్చింరు. తనకేం అర్థమైతలేదు.

‘‘ఏందక్కా! నాకెందుకు సింగారిస్తుండ్రు?’’ అడిగింది సుక్కి..

‘‘నీకు పెండ్లి జేస్తున్నం.. పెండ్లి!’’ అన్నది చిన్న వదిన.

గుండె ఝల్లుమన్నది సుక్కికి.

‘‘నాకు పెండ్లా? నాకు ఎర్కలేకుండ పెండ్లేంది?’’ అడిగింది సుక్కి.. తన్నుకొస్తున్న ఏడ్పును ఆపుకొంటూ.

గుబులుతో వణుకు మొదలైంది.

‘‘మన తెగలల్ల కట్టుబాట్లు గిట్లనే ఉంటయి. ఆడపిల్ల ఇష్టాలతో పనిలేదు! పెద్దోల్లు ఆడపిల్లను ఎవల్లతో జత కట్టియ్యాలనుకుంటే ఆల్లతోనే లగ్గం జేస్తరు. తలొంచుకొని పసుపుతాడు కట్టించుకోవల్సిందేనమ్మా!’’ అన్నది పెద్ద వదిన.

తనను బలిపశువును చేసింద్రని సుక్కికి అర్థమైంది. కళ్లనిండా కుంటి పతంగే కనపడుతున్నడు. ఏం చేయాలో అర్థమైతలేదు. వదినెలూ అక్కలూ కల్సి తనను తలా ఓ పక్కన పట్టుకొని.. పెండ్లి తంతు జరిగే షెడ్డు కాడికి తీస్కొచ్చి, లగ్గం పీటపైన కూకోవెట్టింద్రు. మెల్లెగా తలెత్తి పక్కకు చూసింది. పెళ్లికొడుకు బట్టల్ల పెళ్లిపీటపై కూకోనున్న రాంపాల్ రెడ్డి సేటును చూసి ఉలికిపడింది. ఎవరో చేతబడి మంత్రమేసినట్టు సుక్కి మెదడు మొద్దు వారింది. ఏ ఆలోచనా వస్తలేదు. జరిగేది చూస్తున్నది. ఎవరేం చెప్తున్నరో వింటున్నది. రాంపాల్ రెడ్డి తన మెడల పసుపుతాడు గట్టింది గూడ.. సోయి లేకుంట ఉన్నది.

కాసేపాయినంక ఎల్లయ్య తాత ఊతకర్ర వట్కొని నిలవడి..

‘‘అందరూ జాగర్తగా ఇనుర్రి. పదిహేనేండ్లుగా గీ రాంపాల్ రెడ్డి మనల్ను అన్ని రకాల ఆదుకుంటూ వచ్చిండు. సేటుకు లగ్గమై పదేండ్లు దాటినా, భార్య ఆరోగ్యం బాగలేక పిల్లలు పుట్టలే. పిల్లలు లేనోల్ల గోస మనకెర్కే. పిల్లల కోసరమనే రెండో పెండ్లి చేస్కోవాలనే ఆలోచన చేసి.. మన సుక్కమ్మను తనకిచ్చి లగ్గం జేస్త దేమో కనుక్కోమని ఓ పెద్ద మడిసిని నా కాడికి తోలిండు. నేను పది దినాలు బాగా ఆలోచన చేసిన. అమ్మాఅయ్యా లేని మా సుక్కమ్మ మంచిగా బతుకుత దని ఈ పెండ్లికి ఒప్పుకొన్న. ఇన్నాల్లవట్టీ రాంపాల్ రెడ్డి మనకు సేటు మాత్రమే. ఇయ్యాల్టి సంది చెత్త ఏరుకొని బతికే మనకు సుట్టం గూడ. కాబట్కే.. రేపటి సంది మనందరం రాంపాల్ రెడ్డి దుకాణంలనే స్క్రాప్ అమ్మాలని పెద్దోనిగా అందరి మంచిగోరి చెప్తున్న. అందరికీ ఇష్ట మేనా?’’ అనడిగిండు.

ఆడున్నోళ్లందరూ.. ‘ఓ!’ అన్నరు.

ఇద్దరు వదినెలు సుక్కిని గుడిసె దగ్గరికి పట్టుకొచ్చి..

‘‘రాంపాల్ రెడ్డి ఇప్పుడు సేటు కాదు. నీ పెనిమిటి. బెట్టు సేయకుండా మంచిగ సూస్కో. ఇంకెల్లూ!’’ అని గుడిసె లోపటికి తోలి, వెల్లివోయింద్రు.

ఆపాటికే రాంపాల్ రెడ్డి లోపలుండు. మెల్లగ వచ్చి.. లోపటంగా బేడెం వెట్టి, తనను పట్టుకొచ్చి మంచమ్మీద కూకోవెట్టిండు. తనకేం అర్థమైతలేదు. కండ్లు మూసుకున్నది. ఏం జరిగిందో.. రాంపాల్ రెడ్డి ఏం చేసిండో తనకేం మతికిలేదు.

* * *

అట్ల రాత్రి జరిగిన సంఘటనలు యాదికి రాంగనే ఉలికిపడింది సుక్కి. ఎవల మీదనో కోపం, అంతల్నే దుఃఖం, భయం, మెదడునిండా ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయింది. ఎంటనే పతంగిని కలవాలనుకుంది.

ఉదయం ఆరు కావస్తున్నది. తానానికి చన్నీళ్లు తోడుకున్నది. పెయ్యిమీదున్న పసుపు బట్టలు తీసి ఇసిరేసింది. మెడలోని పసుపుతాడు తెంపి మురికి కాల్వల పారేసింది. రాంపాల్ రెడ్డి తనను ఎక్కడెక్కడైతే తడిమిండో.. అక్కడ సబ్బు – కొబ్బరి పీసుతో రుద్దుకొని తానం చేసింది. పోయిన సంకురాత్రికి పతంగి కొనిచ్చిన పంజాబీ డ్రెస్సు ఏసుకుంది.

‘రేయ్ కుంటోడా! అన్నీ నూ ఇప్పిచ్చినయేరా! అన్నీ నియ్యే! ఈ సుక్కి గుడా నీదేరా!’ అని వాడికి చెప్పాలనుకుంది.

పరుగులాంటి నడకతో పతంగి గుడిసె కాడికొచ్చింది.

గుడిసె తలుపు తెరిసే ఉంది. లోపలికి పోయి చూస్తే పతంగి లేడు. పాత ట్రంకుపెట్టె తెరిచి ఏవో సదురుక పోయినట్టుంది. తనను ఇడ్సివెట్టి ఉండలేక ఎటో వెళ్లిపోయిండని అర్థమయింది.

గుండె బాదుకుంటూ..

‘‘రేయ్ కుంటోడా! మానం వోతే మంచి మనసుతోటి, మంచి నీళ్లతోటి కడిగేసుకుంటే సుబ్రమైపోతా దిరా! పానం బోతే ఎట్ల బతికేదిరా! నూ నా పానానివిరా కుంటోడా! నూ లేకుండా నేనెట్లా బతికేదిరా!’’ అంటూ, తల బాదుకుంటూ గోడుగోడున ఏడుస్తూనే ఉంది.

మళ్ల ఏదో మతిలకొచ్చి ఏడవటం ఆపేసి.. గబుక్కున లేచి బైటికొచ్చింది.

షేరింగ్ ఆటో ఎక్కి.. భగత్‌నగర్ రైల్‌స్టేషన్ కాడ దిగింది. స్టేషన్ల అప్పుడే ఓ రైలు వచ్చి ఆగింది.

ఎక్కేటోళ్లు– దిగేటోళ్ల హడావుడితోని స్టేషన్ రద్దీగా ఉంది. ప్లాట్‌ఫాం మీదికి వచ్చి.. పతంగి కనిపిస్తడేమోనని ఆశగా వెతికింది సుక్కి.

రైలు వెనకనుంచి మూడో పెట్టెల పతంగి ఎక్కుతున్నట్లు అగుపడ్డడు. అప్పుడే రైలు కూతేసి కదిలింది.

‘‘రేయ్ కుంటోడా! నేనొచ్చినానురా! నూ పోమాకూ! నన్నిడ్సివెట్టి పోమాకురా!’’ అంటూ రైలెంట ఉరుకుతున్నది సుక్కి.

ముందు రాత్రి ఏం తినలేదు. సేటు మీదవడి ఒల్లంతా గుల్ల జేసిండు. నిద్ర లేదు. నిస్సత్తువ. అయినా.. ఎట్లాగైనా పతంగిని ఆపాల్నని ఉరుకుతున్నది. అప్పుడే భుజాన ఉన్న చున్నీ జారి కాళ్లల్ల అడ్డ వడటంతో.. దభిల్లుమని కింద వడిపోయి సోయి దప్పింది సుక్కి.

కిందపడ్డ సుక్కిని జనాలు చూసుకుంట పోతున్నరు గాని.. దగ్గరికొచ్చి లేపినోళ్లు లేరు. గంట గడిచింది. అప్పటిదాక తగ్గిన వాన మళ్ల దంచికొట్టింది. ఆ వానకు సోయిలకొచ్చి లేచి కూర్చున్నది సుక్కి. నుదుటికి తాకిన దెబ్బతోని రక్తం కారుతున్నది. మోకాలికి దెబ్బ తలిగి విపరీతంగా నొప్పి పెడుతున్నది. చేత్తో నుదుటి గాయపు రక్తం తుడుచుకొని, చూసుకొని నవ్వుతున్నది. మోకాలి దెబ్బకు పైజామా చిరిగి కనపడుతున్న గాయానికి ఉమ్మితో అద్దుకుంది. నవ్వుతున్నది.. సిగ్గుపడుతున్నది.. ఏడుస్తున్నది! తనలోతానే మాట్లాడుకుంటున్నది.

ఇంతల్నే వేరే రాష్ట్రానికి వెళ్లే ప్యాసింజర్ రైలు వచ్చి నిలబడింది. సుక్కి మెల్లిగా లేచి.. ఓ పెట్టెకాడికి పోయి, దిగుతున్న ఒకాయనను..

‘‘అన్నా! గీ రైలు మా కుంటి పతంగి కాడికి వోతదా?’’ అనడిగింది.

అతను సుక్కి వైపు జాలిగా సూసి.. ‘పాపం’ అనుకొని వెళ్లిపోయిండు. అతని వెనకాలే వస్తున్న ఇంకో యువకుణ్ని కూడా అట్లనే..

‘‘అన్నా! గీ రైలు మా కుంటి పతంగి కాడికి వోతదా?’’ అనడిగింది.

‘‘ఆ పోతది. కుంటి పతంగి ఊరికి పోతది! పతంగి ఇంటికాణ్నే దింపుతది. ఎక్కు పో!’’ అన్నడా ఆకతాయి.

‘‘ఆ! అట్లయితే ఎక్కుతా! కుంటోడు నా ఇంటోడు! వానింటికే వోత!’’ అనుకుంటా రైలెక్కింది.

బోగి నిండా జనమున్నరు.

బోగి తలుపు దగ్గరే కింద కూకోని..

‘‘కుంటోడే నా ఇంటోడు! వాన్నిడ్సివెడ్తనా? వానికాడికే వోత!’’ అనుకుంటా.. తనలోతానే గునుక్కుంటా కూకుంది.

రైలు మెత్తటి కుదుపులకు నిద్రలోకి జారుకుంది సుక్కి.. పాపం పిచ్చితల్లి!

ఏ గమ్యాలకో.. స్థిమితం లేని ఈ ఒంటరి పయనం?

పతంగి – సుక్కి..

సుడిగాలిలో చిక్కిన రెండు చిత్తుకాగితాలు..

రాళ్లల్లోనో.. రప్పల్లోనో?

చెత్త కుప్పల్లోనో.. మురికి గుంటల్లోనో? ■

## సయ్యద్ గఫార్



అట్టడుగు వర్గాల ఆలోచనలు, భావోద్వేగాలే.. సయ్యద్ గఫార్ కథా వస్తువులు. వారి వెతలే.. ఈయన రాసే కథలు! గఫార్ స్వస్థలం నల్లగొండ జిల్లా వాడపల్లి. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. 1973 నుంచీ కథలు రాస్తున్నారు. మొదటి కథ.. ‘పాపం పండిన రాత్రి’. ‘పంచాయతీ రాజ్ లీడర్’ స్థానిక సంస్థల విశ్లేషణ మాస పత్రికను ఎనిమిదేళ్లు నడిపించారు. స్టేజీ నాటకాల్లో నటన, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. 2018లో ‘జనన వాంగ్మూలం’ కవితా సంపుటిని వెలువరించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీల్లో.. ఖుర్బానీ, నషా, ఉల్టాబాజా, మరో ప్రేమకావ్యం కథలకు వరుసగా బహుమతులు దక్కించుకున్నారు. తెలుగు నాటక కళా పరిషత్తు వైజాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు కథా, నాటక పోటీల్లో ‘మౌనధ్వని’ నాటికకు ప్రత్యేక బహుమతి లభించింది. నవతెలంగాణ పత్రిక నిర్వహించిన బండారు అచ్చమాంబ స్మారక కథలపోటీలో ‘హంస’ కథకు మొదటి బహుమతి వచ్చింది. ఈ కథను ‘హంస’ పేరుతో స్వీయ దర్శకత్వంలో లఘుచిత్రంగా నిర్మించారు. ‘ఖుర్బానీ’ కథల సంపుటి, ‘మౌనధ్వని’ నాటికను పుస్తకం రూపంలో తీసుకువచ్చారు.